సాక్షి యాదాద్రి భువనగిరి

సోమవారం । 12 । ఫిబ్రవరి । 2024



గంజాయి ముఠా అరెస్ట్

గంజాయి ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 2.4కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. - 8లో



సోమ్లాల్ నాయక్ ఆదర్శం

గిరిజనులకు సోమ్లాల్ నాయక్ ఆదర్శమని కలెక్టర్ హనుమంతు కె.జెండగే, డీసీపీ రాజేష్‌చంద్ర పేర్కొన్నారు. -10లో



ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

నల్లగొండలో అభయాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా సాగింది. - 10లో

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

భువనగిరి : సాంఘిక సంక్షేమ ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాల కోసం ఆదివారం జిల్లాలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు పరీక్ష జరిగింది. పరీక్షల నిర్వహణకు ఏడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 2,330 మంది విద్యార్థులకు 2,166(92శాతం) మంది హాజరయ్యారు.164 మంది గైర్హాజరయ్యారు. భువనగిరిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల డిప్యూటీ సెక్రటరీ వెంకటలక్ష్మి సందర్శించారు.

యాదాద్రీశుడికి వెండి కలశాల బహూకరణ



వెండి కలశాలను ఆలయ ఈఓకు అందజేస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారికి అమెరికాకు చెందిన చెరుకూరి శలేంద్రరాధిక దంపతులు శుక్రవారం రెండు వెండి కలశాలను బహూకరించారు. ఉదయం శ్రీస్వామి వారిని దర్శించుకున్న అనంతరం ముఖ మండపంలో ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈఓ రామకృష్ణరావుకు వెండి కలశాలను అందజేశారు. వీటిని స్వామివారికి అభిషేకం చేయడానికి వినియోగించనున్నారు.

రహదారిపై సండే రద్దీ



చౌటుప్పల్ రోడ్డుపై బారులుదీరిన వాహనాలు

చౌటుప్పల్ : హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. సెలవు రోజు, శుభకార్యాలు కూడా పెద్ద సంఖ్యలో ఉండడంతో రద్దీ ఏర్పడింది. ట్రాఫిక్ కారణంగా పలు గ్రామాల కూడళ్ల వద్ద ప్రజలు రోడ్డు దాటేందుకు ఇబ్బందులకు గురయ్యారు. ప్రధానంగా చౌటుప్పల్‌లోని ఆర్టీసీ బస్టాండ్, తంగడపల్లి చౌరస్తా, వలిగొండ చౌరస్తాల వద్ద వాహనదారులు, పాదచారులు అవస్థలు పడ్డారు.

భక్తిశ్రద్ధలతో మండమెలిగ



మండమెలిగ వేడుక నిర్వహిస్తున్న భక్తులు

రాజాపేట : సమ్మక్క, సారలమ్మ జాతరలో భాగంగా రాజాపేట మండలంలోని చల్లూరు యాదాద్రి మేడారంలో ఆదివారం మండమెలిగ వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరగుట్ట, పడమటి గుట్టపై ఉన్న సమ్మక్క, సారలమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు డప్పు వాయిద్యాలు, మేళ,తాలాలతో ఊరేగింపుగా వెళ్లి జెండా ఆవిష్కరించారు.

చిరస్మరణీయుడు.. ఘంటసాల

రామగిరి(నల్లగొండ) : మధుర గాయకుడు ఘంటసాల చిరస్మరణీయుడని జాతీయ చలన చిత్ర అవార్డు గ్రహీత డాక్టర్ ఎం.పురుషోత్తమ చార్య అన్నారు. నల్లగొండ లయన్స్ క్లబ్‌లో ఆదివారం జరిగిన ఘంటసాల గానామృత సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఘంటసాల పాటలు తెలుగు సినీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటాయని కొనియాడారు. సభలో పలువురు గాయకులు ఘంటసాల పాటలను ఆలపించారు. విశ్వం ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ కృష్ణ కౌండిన్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ బాధ్యులు దాసోజు శ్రీనివాస్, జ్ఞానేశ్వరచారి, శ్రవణ్, రవికుమార్, రఘువీర్ ప్రతాప్, పున్న అంజయ్య, పెరుమాళ్ల ఆనంద్, డాక్టర్ సాగర్ల సత్తయ్య, అద్దంకి లక్ష్మయ్య, దాసోజు యాదగిరి, దాసోజు లక్ష్మమ్మ, సురేష్‌గుప్తా, బండారు శంకర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, చింతోజు మల్లికార్జునచారి, దీకొండ వెంకటేశ్వర్లు, కత్తుల శంకర్ పాల్గొన్నారు.



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులుదీరిన భక్తులు

నృసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు.. శ్రీస్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టిన అనంతరం ఉత్సవమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. అలాగే ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం శ్రీస్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాఢవీధిలో ఊరేగించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

డయాలసిస్‌కు ఇక్కట్లు!

ఆస్పత్రుల్లో రోగులకు సరిపడాలేని పడకలు

- మూడు కేంద్రాల్లో డయాలసిస్ సేవలు
- జిల్లాలో పెరుగుతున్న బాధితుల సంఖ్య
- హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్న వైద్యులు

భువనగిరి: జిల్లాలోని డయాలసిస్ బాధితులకు సకాలంలో వైద్యసేవలు అందడం లేదు. డయాలసిస్ కేంద్రాల్లో సరిపడా పడకలు లేక కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతూ రక్తశుద్ధి చేయించుకునేందుకు వచ్చే బాధితులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. జిల్లాలో రోజురోజుకూ డయాలసిస్ రోగులు పెరిగిపోతుండడంతో ఈ పరిస్థితి నెలకొంటోంది. డయాలసిస్ సేవల కోసం బాధితులు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తున్నారు. అయితే అక్కడ ఉన్న కేంద్రాల్లో పడకలు తక్కువగా.. రోగులు అధికంగా ఉండడంతో వైద్యసేవలకు రోజుల తరబడి ఎదురుచూడావల్సిన పరిస్థితి. ప్రస్తుతం డయాలసిస్ కేంద్రాల్లో కిడ్నీ బాధితులు రక్తశుద్ధి చేయించుకునేందుకు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ వర్తింపజేసింది. దీంతోపాటు సీఎంసీఓ కార్డు ద్వారా కూడా ఈ కేంద్రంలో చికిత్స పొందేందుకు బాధితులు భారీగా తరలివస్తున్నారు. ఫలితంగా ఆయా కేంద్రాలకు వచ్చే డయాలసిస్ రోగుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది.



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు పొందుతున్న రోగులు

జిల్లాలో మూడు కేంద్రాలు

బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో 2023లో జిల్లాలో మూడు చోట్ల డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసి వాటిల్లో 20 పడకల సౌకర్యం కల్పించారు. వీటిలో కేంద్ర ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రంలో ఐదు పడకలు, ఆలేరు సీహెచ్‌సీలో 10, చౌటుప్పల్ సీహెచ్‌సీలో ఐదు పడకలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో ప్రత్యేకంగా ఒక పడకను హెపటైటిస్ సీ వైరస్ రోగుల కోసం కేటాయించారు. ప్రతి కేంద్రంలో నాలుగైదు షిఫ్టుల్లో 24 గంటలు సేవలందిస్తూ ఒక్కో రోగికి వారానికి మూడు సార్లు (ఒక్కసారికి 4 గంటలు) రక్తం శుద్ధి చేస్తున్నారు. సాధారణంగా రోజుకు 20 నుంచి 23 వరకు రోగులకు సేవలందిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని మూడు కేంద్రాల్లో సుమారు 14,567 మంది డయాలసిస్ చేసుకున్నారు.

సరిపడా పడకలు లేక..

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాల్లో సరిపడా పడకలు లేవు. కానీ, కిడ్నీ బాధితుల సంఖ్య అధికంగా ఉంది. దీంతో కిడ్నీ బాధితులను హైదరాబాద్, నాంపల్లి, ఘట్కేసర్‌లో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. అయితే కొందరు బాధితులు మాత్రం సేవలు పొందేందుకు రోజుల తరబడి నిరీక్షించలేక ప్రాణ భయంతో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ డయాలసిస్ వైద్యసేవలు పొందుతున్నారు.

కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతోంది

> ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని డయాలసిస్ కేంద్రంలో ఐదు పడకలు మాత్రమే ఉన్నాయి. ఇందులో ఇతర కేసులకు సంబంధించిన ప్రత్యేకంగా ఒక పడకను కేటాయించాం. దీంతో ప్రస్తుతం నాలుగు పడకలు సాధారణ కిడ్నీ బాధితుల కోసం ఉపయోగిస్తున్నాం. కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతుండడంతో పడకలు సరిపోవడం లేదు. ప్రభుత్వం అదనంగా పడకలు ఏర్పాటు చేస్తే కిడ్నీ బాధితులందరికీ సేవలందిస్తాం.
>
> – రాజ్‌కుమార్, డయాలసిస్ కేంద్రం ఇన్‌చార్జి కోఆర్డినేటర్, భువనగిరి

ఎంపీడీఓలకు స్థానచలనం

- 14 మందికి స్థానచలనం
- ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు

భువనగిరిటౌన్ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే పోలీసు, రెవెన్యూ అధికారులు బదిలీ కాగా ఆదివారం 14 మంది ఎంపీడీఓలకు స్థానచలనం కలిగింది. ఒకే చోట మూడేళ్ల నుంచి పని చేస్తున్న అధికారులను, సొంత జిల్లాలో పని చేసేవారిని బదిలీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారుల బదిలీ ప్రక్రియ చేపట్టింది.



యాదాద్రి జిల్లా నుంచి..		ఇతర జిల్లాల నుంచి యాదాద్రికి..	
ఎంపీడీఓ పేరు	బదిలీ స్థానం	ఎంపీడీఓ	వచ్చిన స్థానం
పి.జ్ఞానప్రకాశ్‌రావు	నల్లగొండ	కె.నవీన్‌కుమార్	జగిత్యాల
ఈ.వీరస్వామి	మహబూబాద్	వి.రాజా త్రివిక్రమ్	జనగాం
ఎల్. చంద్రమౌళి	నల్లగొండ	ఎం.సత్యాంజనేయప్రసాద్	ములుగు
గీతారెడ్డి	మేడిల్చ్‌మల్కాజ్‌గిరి	బి.యాకుబ్	నల్లగొండ
కె. ప్రభాకర్‌రెడ్డి	వికారాబాద్	పి.ఝాన్సీలక్ష్మీబాయి	నల్లగొండ
ఏ.రాములు	జనగాం	బి.జితేందర్‌రెడ్డి	నల్లగొండ
యూ.శ్రీవాణి	రంగారెడ్డి	కె.ప్రమోద్‌కుమార్	నల్లగొండ
ఎ.బాలశంకర్	రంగారెడ్డి	ఎ.దేవిక	నల్లగొండ
బి. సరిత	రంగారెడ్డి	వై. శ్రీనివాస్‌రెడ్డి	నల్లగొండ
జి.జలేంధర్‌రెడ్డి	జనగాం	ఆర్.భాస్కర్	నల్లగొండ
ఎం. ఉమాదేవి	జనగాం	సీహెచ్. శ్రీనివాస్	రంగారెడ్డి
బి.యాదగిరి	సిద్దిపేట	పి.శంకరయ్య	సూర్యాపేట
శ్రీనివాసులు	జనగాం	ఎం.ఇందిర	సూర్యాపేట
జి.నరేందర్‌రెడ్డి	రంగారెడ్డి	కె.నాగవీణ	వికారాబాద్

పోరాటాల ఫలితమే ఆటోలకు అనుమతి

యాదగిరిగుట్ట : సీపీఐ, ఏఐటీయూసీ పోరాటాల వల్లే యాదాద్రి కొండపైకి ఆటోలను అనుమతించారని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు పేర్కొన్నారు. యాదగిరిగుట్టలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటోలను కొండపైకి అనుమతించాలని సుదీర్ఘంగా పోరాటాలు చేసినట్లు తెలిపారు. అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించామని, ఆటో కార్మికుల ఆందోళనలకు మద్దతు తెలిపామని గుర్తు చేశారు. ప్రభుత్వం యాదాద్రి కొండపైకి ఆటోలను అనుమతించడం శుభ పరిణామంగా పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, మండల కార్యదర్శి గోపగాని రాజు తదితరులు పాల్గొన్నారు.



గుట్టలో మాట్లాడుతున్న గోద శ్రీరాములు

వైష్ణవి కుటుంబానికి న్యాయం చేయాలి

- ప్రిన్సిపాల్, ఆర్‌సీఓను సస్పెండ్ చేయాలి
- వివిధ సంఘాల నాయకుల డిమాండ్
- ఇమాంపేట గురుకులం వద్ద వైష్ణవి తల్లిదండ్రుల ఆందోళన
- మద్దతుగా పాల్గొన్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

సూర్యాపేట రూరల్: సూర్యాపేట మండలం ఇమాంపేట గురుకుల పాఠశాలలో చదువుతూ మృతిచెందిన జిల్లా కేంద్రానికి చెందిన దగ్గుపాటి వైష్ణవి కుటుంబానికి న్యాయం చేయాలని వివిధ పార్టీలు, పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వేధింపుల వల్లే వైష్ణవి మృతిచెందిందని ఆరోపించారు. కుమార్తె మృతికి కారణమైన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఆర్‌సీఓలను వెంటనే సస్పెండ్ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆది వారం ఇమాంపేట గురుకుల పాఠశాల ఎదుట వైష్ణవి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. వీరి ఆందోళనకు బీఎస్పీ రాష్ట్రఅధ్యక్షుడు ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమా ర్, ఆ పార్టీ నాయకులు, వివిధ పార్టీలు, సంఘాల నేతలు, ఎన్టీఆర్ కాలనీ వాసులు మద్దతుగా హాజరయ్యారు. దీంతో పాఠశాల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మూడు గంటల పాటు సాగిన ఆందోళనను చివరకు అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఎస్పీ నాగభూషణం హామీతో విరమించారు.



గురుకులం వద్ద ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్‌తో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

మా కుమార్తెను పొట్టనబెట్టుకున్నారు..

అల్లారుముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కుమార్తెను గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఆర్‌సీఓ వేధించి పొట్టనపెట్టుకున్నారని విద్యార్థిని దగ్గుపాటి వైష్ణవి తల్లిదండ్రులు వెంకన్న, భాగ్యమ్మ ఆరోపించారు. తన బిడ్డ జీవితాన్ని ప్రిన్సిపాల్ నాశనం చేసిందని రోదించారు. హాస్టల్‌లో భోజనం, కూరలు రుచిగా లేవని చెప్పడంలో తప్పు ఏముందన్నారు. ఉన్నతాధికారులకు మెనూ అమలు చేయడంలేదని చెప్పిన పాపానికి ప్రిన్సిపాల్ వేధింపులకు గురిచేయడమేంటని కన్నీరుమున్నీరయ్యారు.

దోషులను శిక్షించాలి

ఇమాంపేట సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకులంలో ఇంటర్ విద్యార్థిని వైష్ణవి మృతి చెందటం బాధాకరమని ప్రముఖ న్యాయవాది, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తళ్లమళ్ల హస్సేన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విచారణ జరిపించి, దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

• ఖోఖో చాంపియన్ నల్లగొండ జట్టు



భువనగిరిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్ ఖోఖో పోటీల్లో విజేతగా నిలిచిన నల్లగొండ జిల్లా మహిళా జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు

వైటీడీఏ నిధులు 50శాతం కవితకు వెళ్లాయి

- జగదీశ్‌రెడ్డికి కూడా వాటా ఉంది
- ఈఎన్‌సీ గణపతిరెడ్డిపై న్యాయ విచారణకు ఆదేశించాలని సీఎంను కోరుతా
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట : యాదాద్రి ఆలయ పునర్‌నిర్మాణం కోసం వైటీడీఏ(యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ) సంస్థకు కేటాయించిన నిధుల్లో 50 శాతం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు వెళ్లాయని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆరోపించారు. ఆదివారం ఆయన యాదగిరిగుట్టలో విలేకరులతో మాట్లాడారు. కవితకు వెళ్లిన నిధుల్లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతకు కూడా వాటా ఉందన్నారు. ఈఎన్‌సీ గణపతిరెడ్డి కూడా అక్రమాలకు పాల్పడ్డారని, ఆయనపై న్యాయ విచారణ చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరుతానని పేర్కొన్నారు. ఆర్‌అండ్‌బీ శాఖకు చెందిన గణపతిరెడ్డిని ఈఎన్‌సీ పోస్టు నుంచి తొలగించాలని అసెంబ్లీలో మాట్లాడుతానని వెల్లడించారు. యాదాద్రి ఆలయ పునర్నిర్మాణంలో అవినీతి జరిగిందని, విచారణ చేపడుతామని స్పష్టం చేశారు.

గుట్టలోనే మెడికల్ కళాశాల

యాదగిరిగుట్టకు మంజూరైన మెడికల్ కళాశాలను సీఎం తన నియోజకవర్గం కొండంగల్‌కు తీసుకెళ్తారని ఎమ్మెల్యే గొంగిడి సునితామహేందర్‌రెడ్డి చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని బీర్ల ఐలయ్య అన్నారు. రాజకీయంగా తన ఉనికిని కాపాడుకునేందుకే అసత్య ప్రచారం చేస్తుందని విమర్శించారు. యాదగిరిగుట్టలోనే మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామని, త్వరలో స్థలాన్ని సేకరించి సీఎం రేవంత్ రెడ్డితో శంకుస్థాపన చేయిస్తామని వెల్లడించారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ.. కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ మెడికల్ కళాశాల గుట్టలోనే ఏర్పాటు కానుందని, ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, స్థలాన్ని కూడా చూస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సుధా, ఎంపీపీ చీర శ్రీశైలం, నాయకులు గుండ్లపల్లి భరత్‌గౌడ్, దుంబాల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బీర్ల ఐలయ్య

• ఎట్టకేలకు కొండపైకి ఆటోలు



సుమారు రెండేళ్ల విరామం అనంతరం ఆదివారం యాదాద్రి కొండపైకి ఆటోలను అనుమతించడంతో జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కలెక్టర్, డీసీపీ, ఆలయ ఈఓ



ఆటోలకు సీరియల్ నంబర్ స్టిక్కర్లు వేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నారపల్లిలోనే భూమి కేటాయించాలి

- హైకోర్టుకు ఏర్పాటుకు అనువుగా ఉంటుంది
- సీఎం రేవంత్‌రెడ్డి భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి లేఖ

భువనగిరిటౌన్ : రాష్ట్ర హైకోర్టు నూతన భవన నిర్మాణాల కోసం నారపల్లిలోనే భూమి కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ భువనగిరి మాజీ ఎమ్మెల్యే, ప్రజా చైతన్య వేదిక కన్వీనర్ కొమ్మిడి నర్సింహారెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. హైకోర్టు నూతన భవన నిర్మాణం కోసం రంగారెడ్డి జిల్లా బుద్వేల్, ప్రేమావతిపేట గ్రామాల పరిధిలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ విశ్వవిద్యాలయాల ఆధీనంలో ఉన్న సుమారు 100 ఎకరాల భూమి కేటాయిస్తూ ప్రభుత్వం జీవో 55 జారీ చేసిందన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి, యువజన సంఘాలతో పాటు పర్యావరణవేత్తలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో జీఓ 55 ఉపసంహరించుకోవాలని కోరారు. మేడ్చల్ జిల్లా ఘట్కేసర్, మేడిపల్లి మండలాల పరిధిలోని నారపల్లి, చెంగిచెర్ల, మేడిపల్లి రెవెన్యూ గ్రామాల్లో సుమారు 700 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అందులో 300 ఎకరాలు హైకోర్టు ఏర్పాటుకు కేటాయించాలని సీఎంకు సూచించారు. ఈ భూమి హైదరాబాద్ – జాతీయ రహదారిని అనుసరించి ఉండటంతో పాటు ఉప్పల్– నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ ముగింపు ప్రాంతం, ఔటర్ రింగ్ రోడ్డుకు, చర్లపల్లి రైల్వే జంక్షన్‌కు, ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉందన్నారు. అంతేకాకుండా బీబీనగర్ ఎయిమ్స్‌వరకు మెట్రో విస్తరణ, మూసీ వెంట మెట్రో ఏర్పాటు, రహదారులను విస్తరించే అవకాశం ఉన్నందున అన్ని విధాలా ప్రయోజనం ఉంటుందన్నారు. 300 ఎకరాల్లో 150 ఎకరాలు కోర్టు భవన నిర్మాణానికి, 75 ఎకరాలు న్యాయమూర్తుల నివాసం ఉండేందుకు, 75 ఎకరాలు ఉద్యోగుల నివాస సముదాయాలు నిర్మించేందుకు కేటాయించాలని కోరారు. ఈ విషయమై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలువనున్నట్లు పేర్కొన్నారు.

వైష్ణవి ఆత్మహత్యపై విచారణ జరపాలి

భానుపురి (సూర్యాపేట): ఇమాంపేటలోని సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలికల గురుకులంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దగ్గుబాటి వైష్ణవి ఆత్మహత్య ఘటనపై పూర్తిస్థాయిలో ప్రభుత్వం విచారణ జరపాలని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు, రాష్ట్ర నాయకుడు పంతం యాకయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మార్చురీలో వైష్ణవి మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. వైష్ణవి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో షేక్ రహమత్ పాషా, భాషపంగు సునీల్, కొలికపంగు వాసు, వెంకటేష్ నాయక్, సందీప్, సంపతు, నాగరాజు పాల్గొన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న అనంతుల మధు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



వైష్ణవి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి పరామర్శ

సూర్యాపేట: మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి ..విద్యార్థి వైష్ణవి ఇంటికి వెళ్లి ఆమె మృతదేహంపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మున్సిపల్ చైర్ పర్సన్ అన్నపూర్ణ, జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటనారాయణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

గాయపడిన వ్యక్తి మృతి

చౌటుప్పల్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లక్కారం గ్రామానికి చెందిన షేక్ అమీర్(40) ఈనెల 9న ద్విచక్ర వాహనంపై చౌటుప్పల్‌కు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఆ క్రమంలో లక్కారం గ్రామానికి వెళ్లే దారిలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతన్ని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

మిర్యాలగూడ అర్బన్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మిర్యాలగూడ పట్టణం బంగారుగడ్డలో నివాసముంటున్న గడ్డం లింగయ్య యాదమ్మ దంపతులకు నలుగురు కుమారులు. వీరిలో చిన్నవాడైన గడ్డం మహేష్(24) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహేష్ ఆర్థిక ఇబ్బందులతోనే అఘాయిత్యానికి పాల్పడ్డాడని తెలిసింది. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని టూ టౌన్ పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని గాయాలు

రామగిరి(నల్లగొండ): కారు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. తిప్పర్తి మండల పరిధిలోని మల్లేపల్లివారిగూడెంలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మల్లేపల్లివారిగూడెం గ్రామానికి చెందిన గోగుల లక్ష్మయ్య జంగారెడ్డిగూడెం క్రాస్ రోడ్డు వద్ద కిరాణ షాపు నుంచి తిరిగి ఇంటికి వెళ్లడానికి నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లక్ష్మయ్యను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

మహిళల విద్యాభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న నాగరాజు

నల్లగొండటౌన్: రాష్ట్రంలో మహిళల విద్యాభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు కోరారు. ఆదివారం సంఘం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించి అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ గురుకులాల్లో ఆత్మహత్యలు చేసుకుంటున్న విద్యార్థినుల విషయంలో విచారణ చేసి దోషులను శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎం.పూజ, మమత, రజనీకాంత్, శ్రీకాంత్‌వర్మ, వైనం రాజు, ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, కావ్య, కుర్ర సైదానాయక్, లక్ష్మణ్‌నాయక్, బుడిగ వెంకటేష్, కోరె రమేష్, రవీందర్, జగదీష్, జగన్, వీరన్న, ప్రసన్న పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

- ఐదుగురు నిందితుల నుంచి 2.4కిలోల గంజాయి, బైక్, సెల్‌ఫోన్లు స్వాధీనం
- పరారీలో మరొకరు
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం : గంజాయి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 2.4కిలోలల గంజాయితో పాటు బైక్, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాహుల్ హెగ్డే నిందితుల వివరాలు వెల్లడించారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లా టేకులపల్లి గ్రామానికి చెందిన బోడ సురేశ్, బానోతు మోహన్, భూక్య అఖిల్, తిరుమలాయపాలెం మండలం బచ్చోడుతండాకు చెందిన ధరావత్‌వినోద్, కూసుమంచి మండలం మంగలితండాకు చెందిన నూనావత్ సాయి, సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన గణపారపు శ్రీకాంత్‌లు స్నేహితులు. వీరు ఓ ముఠాగా ఏర్పడి సులువుగా డబ్బులు సంపాదించేందుకు గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. రెండేళ్లుగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల సరిహద్దుల నుంచి రూ.4,500లకు కిలో చొప్పున గంజాయిని కొనుగోలు చేసుకుని వచ్చి సూర్యాపేట జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు.

గంజాయి రవాణా చేస్తూ..

ముఠాలోని బోడ సురేశ్, భూక్య అఖిల్ కుమార్, బానోతు మోహన్, వినోద్‌లు ఆంధ్రప్రదేశ్ నుంచి తీసుకువచ్చిన 2.4కిలోల గంజాయిని సూర్యాపేట జిల్లాలోని చిలుకూరు మండలం గనపారపు శ్రీకాంత్‌కు అప్పగించాలని నిర్ణయించుకున్నారు. వీరిలో బోడ సురేశ్, భూక్య అఖిల్‌లు బైక్ మీద, బానోతు మోహన్, ధరావత్ వినోద్‌లు గత శనివారం బస్సులో ఇదే జిల్లా మునగాల మండలంలోని బరాకత్ గూడెం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆటోలో చిలుకూరు మండలం బేతవోలు గ్రామ శివారులో మిషన్ భగీరథ ఓవర్ హెడ్ టాంక్ సమీపములోని సాయిలి నవీన్ మామిడి తోటలోకి వెళ్లారు. అదే సమయములో బేతవోలు గ్రామానికి చెందిన గనపరపు శ్రీకాంత్ అక్కడికి వచ్చాడు. అతడికి ముఠా సభ్యులు గంజాయి ప్యాకెట్లు ఇస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారని ఎస్పీ వివరించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.37 వేలు ఉంటుందని తెలిపారు. ఈ ముఠాలో మరో నిందితుడు నునావత్ సాయి పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామన్నారు. సమావేశంలో ఏఎస్పీ మేకా నాగేశ్వరరావు, కోదాడ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది వెంకటేశ్వర్లు, నరేశ్, నాగేశ్, అలీముద్దీన్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి ఎదుట ఆందోళన

- వైద్యుల నిర్లక్ష్యంతోనే రోగి మృతిచెందిందని బంధువుల ఆరోపణ



మిర్యాలగూడలో ఏరియా ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మృతురాలి బంధువులు

మిర్యాలగూడ అర్బన్: వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే రోగి మృతిచెందిందని ఆరోపిస్తూ బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. మిర్యాలగూడలో ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటనపై మృతురాలి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన కన్నెబోయిన సోమమ్మ(63)కు ఉదయం విరేచనాలు కావడంతో 8గంటలకు ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆమెను పరీక్షించిన ఆస్పత్రి వైద్యులు గ్లూకోజ్ పెట్టి ఇంజక్షన్లు వేశారు. ఆ వెంటనే గుండెలో మంట అంటూ సోమమ్మ అరవడంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు ఆస్పత్రి సిబ్బందికి సమాచారం అందించారు. కొద్ది సేపటికే సోమమ్మ మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఇంజక్షన్ వికటించి మృతిచెందిందని కుటుబ సభ్యులు ఆరోపించారు. బంధువులతో కలిసి ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న టూ టౌన్ పోలీసులు అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. రోగి బంధువులతో మాట్లాడి సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ విషయమై వైద్యులను వివరణ కోరగా విరేచనాలు కావడంతో బీపీ పూర్తిగా పడిపోయిందని, ఆమెకు దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నాయని, దీనికి తోడు పెద్ద వయస్సు కావడంతో గుండె పోటుకూడా రావచ్చని, తమ నిర్లక్ష్యం ఏమీ లేదని పేర్కొన్నారు.

చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విజయ

మిర్యాలగూడ అర్బన్: పసుపు కుంకుమ కింద ఇచ్చిన ఇంటిని తండ్రి అమ్ముకుంటున్నాడని ఆరోపిస్తూ ఓ యువతి చేయికోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మిర్యాలగూడ మండలం జప్తివీరప్పగూడేనికి చెందిన కదారి రామనర్సయ్యకు ఇద్దరు భార్యలు. గ్రామంలో ఉన్న ఇంటిని తన మొదటి భార్య కుమార్తె విజయకు పసుపు కుంకుమ కింద ఇచ్చి వివాహం చేశారు. ఈ క్రమంలో రామనర్సయ్య ఆ ఇంటిని అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా విజయ అడ్డుకుంటుంది. పసుపు కుంకుమ కింద ఇచ్చిన ఇంటిని ఎలా అమ్ముకుంటావని పెద్ద మనుషులకు సైతం ఫిర్యాదు చేసింది. అక్కడ న్యాయం జరగకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామని విజయ పేర్కొంది. గత నెల 28న ఇంటిని అమ్ముకోనియ్యడం లేదని విజయపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల వారిని ఆదివారం స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు మాట్లాడుకోవాలని సూచించారు. దీంతో ఇరువర్గాల వారు పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న వ్యవసాయ మార్కెట్ షెడ్డులో మాట్లాడుతున్న సమయంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగిపోయింది. అసలు నాకు పుట్టనేలేదు అని రామనర్సయ్య అనడంతో మనస్తాపం చెందిన విజయ బ్లేడ్‌తో తన చేయిని బలంగా కోసుకుంది. దీంతో చేతి నరాలు తెగిపోయి తీవ్ర రక్తస్రావం అవుతుండగా పోలీస్‌స్టేషన్‌లోకి పరిగెత్తుకుంటూ వచ్చింది. గమనించిన పోలీసులు ఆమెను తొలుత ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఈ మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మోహన్‌రావు(ఫైల్)

అనంతగిరి: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. అనంతగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. అనంతగిరి మండల పరిధిలోని గోండ్రియాల గ్రామానికి చెందిన బండారు మోహన్‌రావు(50) కొంత కాలంగా కోదాడలో కిరాణషాపు నడుపుకుంటూ అక్కడే జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం గోండ్రియాలలో తమ బంధువుల ఇంట్లో జరిగిన ఓ శుభకార్యానికి వెళ్లాడు. సాయంత్రం తన ద్విచక్రవాహనంపై గోండ్రియాలకు చెందిన పేరం పుల్లయ్యతో కలిసి బైక్‌పై కోదాడకు తిరిగి వస్తున్నాడు. మార్గమధ్యలో తమ్మర బండపాలెం సమీపంలోని బైపాస్ రోడ్డు అండర్‌పాస్ వద్ద ఖమ్మం వైపు నుంచి కోదాడకు వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో మోహన్‌రావుకు తీవ్ర పుల్లయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి క్షతగాత్రులను తొలుత కోదాడ ఆస్పత్రికి తరలించారు. మోహన్‌రావు పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య బండారు రామాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అనంతగిరి ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

వారంలో పెళ్లి.. అంతలోనే మృత్యు ఒడికి

- బైక్ అదుపుతప్పి యువకుడు మృతి
- పత్రికలు పంచి వస్తుండగా దుర్ఘటన



శివకుమార్ (ఫైల్)

నార్కట్‌పల్లి/మోత్కూరు : వారం రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. తన వివాహ పత్రికలు బంధువులకు పంచి వస్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. నల్లగొండ జిల్లాలో శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రానికి చెందిన సకినాల వెంకటయ్యకు ఇద్దరు కుమారులు.అందులో రెండో కుమారుడైన శివకుమార్(26) వివాహం ఈ నెల 18వ తేదీన జరగాల్సి ఉంది. తన వివాహ వేడుకకు బంధువులు, స్నేహితులను ఆహ్వానించేందుకు శివకుమార్ శనివారం ఉదయం పత్రికలు తీసుకుని బంధువు అప్పిశెట్టి నితిన్‌కుమార్‌తో కలిసి బైక్‌పై నల్లగొండ జిల్లాలోని ఆయా గ్రామాల్లో పర్యటించాడు. పత్రికలు పంపిణీ చేసిన తర్వాత రాత్రి 11గంటల సమయంలో మోత్కూరుకు బయలుదేరారు. మార్గమధ్యలో నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు సమీపంలో వీరి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోవడంతో శివకుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని వెంటనే 108 వాహనంలో నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. నితిన్‌కుమార్‌కు ఏలాంటి గాయాలు కాలేదు. మృతుడి సోదరుడు సంకినాల సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.

టీ లైఫ్ బీమా పేరిట టోకరా



హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితులు

హుజూర్‌నగర్ : బీమా పేరిట కొందరు వ్యక్తులు పలువురికి టోకరా ఇచ్చారు. హుజూర్‌నగర్‌లో ఆదివారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై బాధితులు సూరేపల్లి సత్యనారాయణ, మేళ్లచెరువు జ్యోతి, దేవపంగు రమాదేవి, డి సంపత్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గరిడేపల్లి మండలానికి చెందిన కందుల వినయ్, పుల్లెంల అనిల్ టీలైఫ్‌లో ఆరోగ్యం బాగాలేని వారు, రెండు, మూడు నెలల్లో చనిపోయే దశలో ఉన్నవారు రూ.లక్ష చెల్లించి బీమా చేయించుకుంటే మరచించిన తర్వాత ఐదారు నెలల్లో రూ.6లక్షలు వస్తాయని నమ్మ బలికారు. దీంతో నియోజవర్గంలోని పదుల సంఖ్యలో బాధితులు బీమా చేయించుకున్నారు. గడువు ముగిసినా బీమా రాకపోవడంతో ఇటీవల అనిల్, వినయ్‌లను బాధితులు నిలదీశారు. దీంతో వారికి ప్రామిసరి నోట్‌లు, చెక్కులు రాసిచ్చారు. ఏళ్లు గడుస్తున్నా కట్టిన డబ్బులు రావడం లేదు. హుజూర్ నగర్ పరిధిలోని మాధవరాయిని గూడెం వద్ద ఒక ఇంట్లో నివాసం ఉంటున్న వినయ్ తన ఇంటిని పదో తారీఖు రాత్రి ఖాళీచేసి పోయేందుకు ప్రయత్నించగా బాధితులు కొందరు పసిగట్టి వ్యాన్‌ను, డ్రైవర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై బాధితులు ఫిర్యాదు ఇచ్చారని విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

కేంద్రానికి తలొగ్గే ప్రాజెక్టుల తాకట్టు

- బీఆర్ఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

మోత్కూరు : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రానికి తలొగ్గి తెలంగాణ ప్రాజెక్టులను తాకట్టు పెట్టారని బీఆర్ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించడాన్ని నిరసిస్తూ ఈనెల 13న నల్ల గొండలో నిర్వహించనున్న బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని సభకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం మండల కేంద్రంలో ఆవిష్కరించి మాట్లాడారు. పదేళ్లు కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని విధాలా ఒత్తిళ్లు తెచ్చినా తలొగ్గకుండా కేఆర్ఎంబీ పరిధిలోని ప్రాజెక్టులను కాపాడుకుంటూ వచ్చారని అన్నారు. కృష్ణా బేసిన్‌లో నీటి కొరత ఏర్పడితే 14జిల్లాలకు కనీసం తాగడానికి నీరు దొరకని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల అప్పగింతతో కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి తీరని ద్రోహం చేశారని అన్నారు.. టీఎస్‌ను టీజీగా మార్చినంత మాత్రాన ప్రజలకు ఏ విధంగా న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. 17ఎంపీ సీట్లు గెలుస్తామనే ధీమాతో ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని గొప్పగొప్పగా ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నబోయిన రమేష్, పట్టణ అధ్యక్షుడు బి.కళ్యాణ్‌చక్రవర్తి, కార్యదర్శి గజ్జి మల్లేష్, మార్కెట్ మాజీ చైర్మన్లు కె.యాకూబ్ రెడ్డి, అశోక్‌రెడ్డి,జంగ శ్రీను పాల్గొన్నారు.

చాక్లెట్ ఆశ చూపి బాలికను బెదిరించి..

- భయంతో పరుగులు తీసిన మైనర్
- స్థానికులు అప్రమత్తం కావడంతో పారిపోయిన దుండగుడు

నేరేడుచర్ల : పదేళ్ల చిన్నారికి చాక్లెట్ ఇస్తానని ఓ దుండగుడు ఆశ చూపి బెదిరించాడు. నేరేడుచర్ల మున్సిపాలిటీలోని చింతబండ వద్ద శనివారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చింతబండ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న చిన్నారి సాయంత్రం నడుచుకుంటూ ఇంటికి వెళ్తోంది. ఆ సమయంలోనే ఓ దుండగుడు ద్విచక్రవాహనంపై వచ్చి ఆ చిన్నారికి చాక్లెట్ ఇస్తానంటూ అనడంతో తీసుకోకుండా వెళ్లిపోతుంది. చాక్లెట్ ఎందుకు తీసుకోవని బెదిరించినట్లు మాట్లాడటంతో ఆ చిన్నారి భయంతో పరుగులు పెట్టి పక్కనే ఉన్న ఓ ఇంటిలో తలదాచుకుంది. అక్కడ ఉన్నవారికి విషయం చెప్పడంతో బయటకు వచ్చే సరికి దుండగుడు పారిపోయాడు. గ్రామాల్లో అపరిచిత, అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులు, 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ పచ్చిపాల పరమేష్ కోరారు.

మతిస్థిమితం లేని వ్యక్తికి ఆశ్రయం

భువనగిరి రూరల్ : మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తిని చేరదీసి ఆశ్రయం కల్పించాడు.. భువనగిరి మండలంలోని రాయగిరి సహృదయ అనాథ ఆశ్రమం నిర్వాహకుడు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో శ్మశానవాటికలో చెత్తకుప్పల్లో మతిస్థిమితం కోల్పోయి, మూగ వ్యక్తిని సహృదయ అనాథ ఆశ్రమం నిర్వాహకుడు మహ్మద్ చోటు గుర్తించాడు. అతడిని తీసుకువచ్చి తన ఆశ్రమంలో ఆశ్రయం కల్పించాడు. ఈ సందర్భంగా చోటును వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు కమ్మగోని ప్రభాకర్ గౌడ్, మహ్మద్ వలీ పాషా, మహ్మద్ రషీద్‌లు అభినందించారు.

క్రీడల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం



బాలికల ఖోఖో ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న నల్లగొండ- రంగారెడ్డి జట్ల క్రీడాకారులు



ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన కరీంనగర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి : క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణంలో ఈనెల 9న ఉమ్మడి నల్లగొండ ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన 56వ సీనియర్ తెలంగాణ రాష్ట్ర స్థాయి ఖోఖో చాంపియన్ షిప్ 2023–24 పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో విజేతలకు రాత్రి ఎమ్మెల్యే బహుమతులు అందజేసి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి క్రీడలు నిర్వహించడం జిల్లాకు గర్వకారణమన్నారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించే విధంగా భువనగిరిలో క్రీడా మైదానాలు ఉన్నాయని చెప్పడానికి ఇది నిదర్శనమన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో యువజన క్రీడల అభివృద్ధి జిల్లా అధికారి ధనుంజనేయులు, ఆర్డీఓ కార్యాలయ పరిపాలనాధికారి మందడి ఉపేందర్‌రెడ్డి, స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ జిల్లా సెక్రటరీ స్టాలిన్‌బాబు, విద్యుత్ ఎస్ఈ శ్రీనాథ్, డీఈ మల్లికార్జున్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు పగిడాల జలంధర్‌రెడ్డి, సోను, నాతి కృష్ణమూర్తి, రమేష్‌రెడ్డి, అంజనేయులు, నరేష్, శ్రీను నాయక్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

గెలుపొందిన జట్లు ఇవే..

56వ సీనియర్ తెలంగాణ రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ 2023–24 మహిళల విభాగంలో మొదటి స్థానం ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు చాంపియన్ షిప్ సాధించగా, రెండో స్థానంలో రంగారెడ్డి జిల్లా, మూడో స్థానంలో మహబూబ్‌నగర్, నాలుగో స్థానంలో హైదరాబాద్ జిల్లా జట్లు నిలిచాయి.

పురుషుల విభాగంలో..

ప్రథమ స్థానంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు, రెండో స్థానంలో రంగారెడ్డి జిల్లా, మూడో స్థానంలో వరంగల్, హైదరాబాద్ జిల్లా జట్లు ఉన్నాయి.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

VILLAS FOR SALE

■ **Ready To Occupy Duplex Luxury** 3 BHK - 2340 Sft Villas In The Best Gated Community At Miryalaguda Next To New Dmart, Clubhouse, Swimming Pool, Fully Operational Must See. Call: 8069045560. [H-787931]

Education

■ **One Sitting / Regular: 10th, Inter, NIOS,** TOSS, APOSS, DEG, PG, Nagarjuna, SV, YVU, University, Guidelines for B.Tech failed students (KPHB) Ph: AES 9515390685, 9032284760 [H-801585]

Services

■ రుణాలు,వ్యక్తిగత,వ్యవసాయం,వ్యాపార రుణం,తక్కువవడ్డీ రేటు,సిబిల్‌అవసరంలేదు, NPAకూడా దరఖాస్తు చేసుకోవచ్చు.ఏజెంట్స్ కావలెను. అర్బన్ ఫైనాన్స్, పార్థిబా, 7627832084. [T-229]

Wanted

■ **Wanted trained teachers** for High School & Primary School. Sub: Science, English, & Maths, Salary Negotiable, Ramannapet 9652531679 [Y-784405]

■ మన పట్టణాలలో కొత్తగా స్థాపించిన బ్రాంచ్ నందు పనిచేయుటకు ఇంటర్, డిగ్రీ చదివిన యువతి/యువకులు కావలెను. వర్క్ ఫ్రం హోం కలదు. సంప్ర॥ 7013376444 [G-824413]

■ **Sales & Service Engineers, Qly:** Dip. Electronics & B.Sc Electronics/ Any Degree. Divis Medical Systems, Vja, Hyd ✆ 9885327399/ 8498968592 [B-1264554]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233785]

■ **Wanted Development Officers** SBI Life Insurance at Bhongiri Branch, Salary: 25,000/- + Incentives, Qualification: Any Degree, M/F, Min.1 Year Experience, BM ✆ 9533254107 [Y-784295]

■ పనిమనిషి కావలెను. హైదరాబాద్‌లో డాక్టర్స్ కుటుంబానికి ఇంట్లోనే ఉండి వంట పని మరియు చిన్నపిల్లలను చూచుకొనుటకు 18 నుంచి 30 ఏళ్లలోపు గల స్త్రీ కావలెను. జీతం : 15,000/- ఫ్రీ భోజనము, వసతి కలదు. వివరాలకు డి.బాలాజీ : 92469 69042, 98481 75211 [V- 2393]

■ శ్రీ విఘ్నేశ్వర హోండా షోరూం నల్లగొండ నందు సేల్స్ ఎగ్జిక్యూటీవ్ (Male), సర్వీస్ సూపర్ వైజర్స్, కంప్యూటర్ ఆపరేటర్, స్పేర్‌పార్ట్స్ ఎగ్జిక్యూటీవ్ (Female) మరియు నార్కట్‌పల్లి, మాల్ నందు సేల్స్ ఎగ్జిక్యూటీవ్, మెకానిక్ కావలెను. సంప్ర॥ 9290053788, 9290143623 [YA-15217]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పుచ్చ పంట సాగుకు అనువైన సమయం ఇదే..

- తక్కువ ఖర్చు, అధిక దిగుబడి
- హార్టికల్చర్ కన్సల్టెంట్ సుందరి సురేష్

పాడి పంట



సాగులో ఉన్న పుచ్చ



సుందరి సురేష్, హార్టికల్చర్ కన్సల్టెంట్

నడిగూడెం : వచ్చే వేసవిలో పుచ్చకు బాగా డిమాండ్ ఉంటుంది. పుచ్చలో తక్కువ క్యాలరీలు, ఎక్కువశాతం విటమిన్ ఏ, సీ ఉండటమే కాక దాహాన్ని తీర్చే గుణం కలిగి ఉంటుంది. ఇవి అధిక ఉష్ణోగ్రత గల ప్రాంతాల్లో బాగా పెరుగుతాయి. ప్రస్తుతం ఈ పంట సాగుకు అనుకూలమని హార్టికల్చర్ కన్సల్టెంట్ సుందరి సురేష్ చెబుతున్నారు.

వాతావరణం : వాతావరణంలో ఉష్ణోగ్రతలు 30డిగ్రీల సెంటీగ్రేడ్ లోపు మిక్కిలి అనుకూలం.

నేలలు : లోతైన నేలలు తప్ప ఎర్రటి చెల్క నేలలు, ఇసుక నేలలు, ఒండ్రుమట్టి నేలలు, ఇసుక కలిసిన మిశ్రమ నేలలు అనుకూలం. మురుగు నీరు సౌకర్యం గల నేలలు కూడా అనుకూలం.

విత్తే సమయం : ప్రస్తుత ఫిబ్రవరి నెలాఖరు వరకు అనుకూలం.

రకాలు : ఆశాహి–యమాట, సుగర్ బేబీ, అర్కజ్యోతి, అర్కమానిక్, దుర్గాపూర్ కేసర్ తదితర రకాలు సాగు చేసుకోవచ్చు.

విత్తన మోతాదు : ఒక ఎకరానికి 500 గ్రాములు విత్తనం సరిపోతుంది.

విత్తనశుద్ధి : విత్తనశుద్ధి బీజామృతం లేదా పంచగవ్యతో విత్తన శుద్ధి చేసుకోవాలి. దోసజాతికి చెందిన పంటలను పంచగవ్యతో విత్తన శుద్ధి చేస్తే ప్రభావం అధికంగా చూపిస్తుంది.

కలుపు నివారణ : కలుపు మొక్కలను చేతితో పీకిలించాలి.

నీటి యాజమాన్యం : పంట వేసిన మొదటి 3–4 వారాలలో క్రమం తప్పకుండా నీటి నందించాలి. డ్రిప్ పద్ధతిలో నీరందించడం అత్యుత్తమ పద్ధతి.

పోషకాల యాజమాన్యం : విత్తనశుద్ధి చేసిన తరువాత వరుసల మధ్య 100 సెం.మీ. (3–3.5 అడుగుల) దూరం పాటించి, మొక్కలను వరుసలలో 30–50 సెం.మీ. దూరంలో విత్తుకోవాలి. మొలకెత్తిన వెంటనే నీమాస్త్రం, కంపోస్టు టీ పిచికారీ చేయాలి. తొలి దశలో రసం పీల్చు పురుగులు దాడి అధికంగా ఉంటుంది. కనుక నీమాస్త్రం వాటి నివారణకు ఉపయోగపడుతుంది. కంపోస్టు టీ మొక్కల ఎదుగుదలతో పాటు తెల్లదోమ నివారణకు ఉపయోగపడుతుంది. తీగ మూరెడు సాగిన తర్వాత కొనను తుంచి వేసి 3శాతం పంచగవ్య ద్రావణం పిచికారీ చేయాలి. దీని వలన పక్క తీగలు ఎక్కువగా వచ్చి ఆకులు పెద్ద పరిమాణంలో ఏర్పడతాయి. తుంచిన తీగ కొత్త చిగుర్లు వేసిన వెంటనే చేప అమినోయాసిడ్ పిచికారీ చేసుకుంటే పెరుగుదల బాగుంటుంది. పూత దశకు చేరే లోపు అంటే నాటిన నెల రోజుల్లో తులసీ–కలబంద కషాయం పిచికారీ చేసుకుంటే మొక్కలు శిలీంద్ర, బ్యాక్టీరియా, వైరస్ తెగుళ్ల బారినుంచి కాపాడటమే కాక, అదనపు పెరుగుదలకు ఉపయోగపడుతుంది. 15 రోజుల వ్యవధిలో జీవామృతం సాళ్ల ద్వారా నీటిలో కలిపి పారించడం లేదా డ్రిప్ ద్వారా పారించడం కొనసాగించాలి. వారం రోజుల వ్యవధిలో పంచగవ్య పిచికారీ చేస్తే నాణ్యమైన దిగుబడి వస్తుంది. అనేక పంటలలో పంచగవ్య పిచికారీ వలన దిగుబడులు రెట్టింపయినట్లు పరిశోధనలు నిరూపించాయి.

సాగు విధానం : దుక్కిని మెత్తగా దున్నుకొని బోదెలు ఏర్పాటు చేసుకోవాలి. బోదెల మధ్య సాలు తోలుకుని అందులో ట్రికోడెర్మావిరిడె, సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్, అజోస్పైరిల్లం, పీయస్‌బీ, పశువుల ఎరువు నాడెపు కంపోస్టు లేదా ఘనజీవామృతం వేసి, సాలుని మూసివేయాలి. ఈ పద్ధతి వలన పుచ్చ పంటలో నాణ్యమైన దిగుబడులు లభించడంతో పాటు తరువాత సాగు చేసే పంటలకు ఉపయోగపడుతుంది.